క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మై హోం మంగళ పరిసరాలు, శిల్పవ్యాలీ, సెంట్రల్ పార్క్, కాంతివనం, హెచ్ఏఎల్ లేఅవుట్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రభుపాద టౌన్‌షిప్, మసీద్ బండ విలేజ్, మసీద్‌బండ ఎక్స్ రోడ్డు, లగ్జర్ అపార్ట్‌మెంట్స్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలో బుధవారం సుమారు రూ.5.06 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీప్తిశ్రీనగర్ కాలనీలో రూ.73 లక్షలతో సీసీ రోడ్లు, ఇందిరానగర్ కాలనీలో రూ.3.70 కోట్లతో, వేమన వీకర్ సెక్షన్ కాలనీలో రూ.63 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 13 మందికి కొవిడ్ ర్యాపిడ్ యాంటిజెన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు 15 మందికి చేశామన్నారు.

బోనాల పండగ ఏర్పాట్లపై సమావేశం

పటాన్‌చెరు టౌన్: ఈ నెల 13వ తేదీన పట్టణంలో నిర్వహించనున్న బోనాల పండగ ఏర్పాట్లపై మంగళవారం కోదండ సీతారామస్వామి ఆలయంలో సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ రెండేళ్లుగా రెండు రోజుల పాటు నిర్వహించే బోనాల పండగను ఈ ఏడాది ఒకేరోజు నిర్వహించాలని పట్టణ ప్రజల విజ్ఞప్తి మేరకు ఒకేరోజు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ జెడ్పీటీసీ జైపాల్, మాజీ కార్పొరేటర్లు శంకర్‌యాదవ్, సపానాదేవ్, గూడెం మధుసూదన్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటుపై జీఎం రాజశేఖర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ మంజుల

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. గౌతమీనగర్‌లో సీసీ రోడ్డు పనులు పరిశీలన, భవానీపురం, వేమన వీకర్ సెక్షన్ కాలనీ, కేఎస్ఆర్ లేబొట్‌లలో నూతనంగా చేపట్టాల్సిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులపై అధికారులతో చర్చించారు. అనంతరం రాజేందర్‌రెడ్డి నగర్‌లో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో జలమండలి జీఎం రాజశేఖర్, డీజీఎం నాగప్రియ, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, మేనేజర్ సుబ్రహ్మణ్యం, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరత..

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బందితో మంగళవారం డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని సుమారు 500ల మందికి పైగా విద్యార్థులు ఉన్నారని, 11 మంది ఉపాధ్యాయులు ఉన్నారని సిబ్బంది కొరత ఉందని వివరించారు. సమస్యను ఎమ్మెల్యే గాంధీ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, పాఠశాల హెచ్ఎం రాధాపద్మజ, ఎస్ఎంసి చైర్మన్ మల్లయ్య మోహన్‌రావు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నివాళి

మియాపూర్: అల్లూరి స్ఫూర్తితో యువత దేశాభివృద్ధికి నడుం బిగించాలని టీపీసీసీ జనరల్ సెక్రటరీ జెరిపేటి జైపాల్ అన్నారు. అల్లూరి సీతారామారాజు జయంతి సందర్భంగా మంగళవారం మియాపూర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోచయ్య, కవిరాజ్, శేఖర్, గణేష్, రాజ్ కుమార్, పండు, రమేష్, రాజు, సాగర్, షఫీ, యాదగిరి, భీమ్‌రావు, ప్రవీణ్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులున్నారు.




కిడ్స్‌జోన్‌లో ఆడుకుంటున్న చిన్నారులు

ఆడుకుందాం రండి..

సెలవు రోజుల్లో శిల్పారామంలో చిన్నారుల సందడే సందడి

మాదాపూర్: ప్రకృతి ఒడిలో చిన్నారులు సరదాగా గడుపుతున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన కిడ్స్ జోన్ చిన్నారులను ఆకట్టుకుంటోంది. 2-15 సంవత్సరాల వయస్సు గల చిన్నారులు ఆడుకోవడానికి జారుడు బల్ల, ఉయ్యాల తదితరాలను ఏర్పాటు చేశారు. వందల సంఖ్యలో చిన్నారులు ఇక్కడకు వచ్చి ఆడుకుంటున్నారు. పక్కనే వివిధ దేశాలకు చెందిన పక్షులు, కోళ్లు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. పచ్చని వాతావరణంలో చిన్నారులను ఆడించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. సెలవురోజుల్లో భారీగా వస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.



ఆకట్టుకుంటున్న పెయింటింగ్స్



వెదురుబొంగులతో ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారం









కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు

ఆల్విన్‌కాలనీ: కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు సుమారు 69 లక్షల 8వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే గాంధీ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నే శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నాయకులు సంజీవరెడ్డి, లక్ష్మీనారాయణ, హరీష్‌రావు పాల్గొన్నారు.

ఈటల సమక్షంలో బీజేపీలో చేరికలు



బీజేపీలో చేరిన ముదిరాజ్ సంఘం నాయకులు

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడ గ్రామస్తులు, ముదిరాజ్ సంఘం నాయకులు మంగళవారం ఈటల రాజేందర్ సమక్షంలో రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దొరల గడీలకు గండి కట్టే రోజులు దగ్గరపడ్డాయన్నారు. అధికార పార్టీ అహంకార పోకడలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలంటే ముదిరాజ్ బిడ్డలందరూ బీజేపీలో చేరాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వినోద్‌రావు, ఎల్లేష్, గణేష్ ముదిరాజ్, రవి ముదిరాజ్, శివరాజ్ ముదిరాజ్, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ

గచ్చిబౌలి: కొత్తగూడలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రఘునాథ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ ఫౌండేషన్ చైర్మన్ మారబోయిన రఘునాథ్‌యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. దేశ నిర్మాణం విద్యార్థుల చేతుల్లోనే ఉందని, ఇష్టమైన రంగాల్లో విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గోవింద్, శ్రావణ్‌గౌడ్, కుమార్‌సాగర్, భరత్, పవన్, శ్రీకాంత్ నాయక్, హమీద్, బాబా, వినోద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేస్తున్న రఘునాథ్‌యాదవ్

రాష్ట్రపతి పర్యటన.. భారీ బందోబస్తు



గచ్చిబౌలి: అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకల ముగింపు కార్యక్రమానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరయ్యారు. మంగళవారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగిన ముగింపు వేడుకలకు రాష్ట్రపతి హెలికాప్టర్‌లో వచ్చి వెళ్లినప్పటికీ ప్రత్యామ్నాయంగా రోడ్డు మార్గంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. రాష్ట్రపతి పర్యటన ప్రశాంతంగా ముగిసింది.

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మధ్యాహ్నం 3.45 గంటలకు హకీంపేట్ నుంచి గచ్చిబౌలి స్టేడియానికి హెలికాప్టర్‌లో చేరుకున్నారు.
- రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో గచ్చిబౌలి స్టేడియానికి వచ్చినప్పుడు, తిరిగి వెళ్లినప్పుడు ట్రిపుల్ ఐటీ, హెచ్‌సీయూ రోడ్డులో మసీద్‌బండ వద్ద వాహనాల రాకపోకలను కొద్దిసేపు నిలిపివేశారు.
- మిగతా సమయంలో ఐటీ ఉద్యోగులతో పాటు ఇతర వాహనదారులు గచ్చిబౌలి స్టేడియం రోడ్డులోకి అనుమతించారు.

అభివృద్ధికి కేంద్రాలుగా గ్రామాలు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రతీ గ్రామం అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం ఘనపూర్ గ్రామంలో రూ.కోటి అంచనా వ్యయంతో చేపట్టనున్న గ్రామపంచాయతీ భవనం, ఎస్సీ కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన, రూ.17 లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనం ప్రారంభోత్సవ కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల పాలనలో అభివృద్ధికి నోచుకోని గ్రామాలు నేడు సీఎం కేసీఆర్ దూరదృష్టితో అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఇంట్లో సంక్షేమం, ఇంటి ముంగిట అభివృద్ధి నినాదంతో బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వానికి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలన్నారు.

ఆలీ తలాబ్ చెరువు పనులు పరిశీలన



చెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆలీతలాబ్ చెరువు సుందరీకరణలో భాగంగా 1 కోటి 83 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న అలుగు నిర్మాణం, పైపులైన్ నిర్మాణ పనులను మంగళవారం ఇరిగేషన్ అధికారులతో స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు మురికికూపంలా ఉన్న ఆలీ తలాబ్ చెరువుకు మహర్దశ పట్టిందన్నారు. చెరువు ప్రాంతం ఆక్రమణకు గురి కాకుండా చెరువు చుట్టూ కంచె చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఏఈ విశ్వం, శ్రీధర్‌రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మున్సిపల్ చైర్మన్



పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తన జన్మదినం సందర్భంగా మంగళవారం రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్ రావును కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి స్వయంగా పాండు రంగారెడ్డి ఇంటికి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పలు కాలనీ సంఘాల అధ్యక్షులు, కౌన్సిలర్లు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొర్ర వెంకటరెడ్డి, దశరథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ-డ్రిల్స్ అవగాహనా ఒప్పందం

అకడమిక్, పరిశోధనా రంగాల్లో పరస్పర సహకారం



ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ప్రొ.బీజేరావు, ఇరు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: అకడమిక్, పరిశోధనా రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, డ్రిల్స్ సంస్థ నిర్ణయించాయి. ఈ మేరకు మంగళవారం హెచ్‌సీయూ, డాక్టర్ రెడ్డీస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ (డ్రిల్స్) మధ్య పదేళ్ల పాటు ఉమ్మడి విద్య, పరిశోధనా కార్యకలాపాల కోసం అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంపై హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు సమక్షంలో హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్, డ్రిల్స్ సంస్థ కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, డ్రిల్స్ బోర్డు చైర్మన్ జీవి ప్రసాద్ సంతకాలు చేశారు. అధునాతన ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ రంగంలో విశ్వవిద్యాలయ విద్యార్థులు, పరిశోధకులకు నైపుణ్యాభివృద్ధికి డ్రిల్స్ సంస్థ మద్దతు ఇస్తుంది. హెచ్‌సీయూ నుంచి ప్రొఫెసర్ శర్మిష్ఠ బెనర్జీ, డ్రిల్స్ నుంచి డాక్టర్ శ్రీనివాస్ ఓరుగంటి సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారు.

'కాల్ హెల్త్'.. ఇంటి వద్దకే వైద్య సేవలు

హఫీజ్‌పేట్: కాల్ హెల్త్ ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు ప్రారంభించారు. మంగళవారం గచ్చిబౌలిలోని రాంకీ టవర్స్‌లో కాల్‌హెల్త్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పీబీఎస్ చౌదరి, డాక్టర్ అమానుల్లాలు మాట్లాడుతూ డాక్టర్లు, రక్త పరీక్షలు, బీపీ చెకప్, ఈసీజీ, డయాగ్నస్టిక్స్, సీజీఎం (కంటిన్యూస్ గ్లూకోజ్ మానిటరింగ్), ఈఈజీ (ఎలక్ట్రోనిసెపలోగ్రాం), హోల్టర్ మానిటరింగ్, ఆడియోమెట్రి, స్పీచ్ థెరపీ నిరంతరాయ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కాల్‌హెల్త్ హెల్ప్‌లైన్, యాప్ ద్వారా ఈ సేవలను పొందవచ్చన్నారు.



రాంకీ టవర్స్‌లో కాల్‌హెల్త్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వైద్యులు

గోధుమకు ప్రత్యామ్నాయం జొన్న

రాయదుర్గం: వాతావరణ సవాళ్ల నేపథ్యంలో గోధుమకు భారత్‌లో స్థిరమైన ప్రత్యామ్నాయంగా జొన్న అని తాజాగా నిర్వహించిన ఒక పరిశోధనలో తేలింది. గచ్చిబౌలిలోని ఐఎస్‌బీ సంస్థ ప్రపంచంలోని పలు సంస్థలతో కలిసి చేసిన పరిశోధన వివరాలను మంగళవారం ప్రకటించింది. కొలంబియా వర్సిటీ నుంచి పరిశోధకులు ఈ అధ్యయనం చేశారు. చైనీస్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ (చైనా), ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఇండియా), యూనివర్సిటీ ఆఫ్ డెలావేర్ (యూఎస్ఏ), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ముంబయి (ఇండియా) వాషింగ్టన్ స్టేట్ యూనివర్సిటీ(యూఎస్ఏ) బృందాలు కలిసి పరిశోధన చేశాయి. ఈ సందర్భంగా ఐఎస్‌బీలోని భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ అధ్యయన సహ రచయిత, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అశ్వినిఛత్రే మాట్లాడుతూ రబీ సీజన్‌లో వాతావరణ-స్మార్ట్ వ్యవసాయ జోక్యాల తక్షణ అవసరాన్ని మా పరిశోధన హైలైట్ చేస్తుందన్నారు. సాంప్రదాయకంగా పెరిగిన జొన్న గేమ్ చేంజర్‌గా ఉద్భవించిందన్నారు. ఒడిశా రాష్ట్ర వ్యవసాయం, రైతుల సాధికారత శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ అరబిందపాదీ మాట్లాడుతూ వరి లేదా గోధుమలకు సరైన ప్రత్యామ్నాయంగా మిల్లెట్, జొన్న గుర్తింపు పొందుతున్నాయన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

మియాపూర్ : సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో రూ.11కోట్ల 81లక్షలతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్డు పనులకు, వరదనీటి కాల్వల నిర్మాణం, స్మశాన వాటిక తదితర అభివృద్ధి పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మియాపూర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు, ఏరియా కమిటీ సభ్యులు, ఉద్యమకారులు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఐఐహెచ్‌ఎంలో హాస్పిటాలిటీ స్కిల్ కోర్సు ప్రారంభం

గచ్చిబౌలి: అడ్మిషన్ రోజే ఉద్యోగం కల్పిస్తామని ఐఐహెచ్ఎం (ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్) చైర్మన్ డాక్టర్ సుబోర్నో బోస్ పేర్కొన్నారు. మంగళవారం గచ్చిబౌలిలోని ఐఐహెచ్ఎం హైదరాబాద్ డైరెక్టర్ ఎర్నెస్ట్ ఇమాన్యుయేల్ పర్యవేక్షణలో వర్చువల్‌గా 'హాస్పిటాలిటీ స్కిల్స్' షార్ట్‌టర్మ్ కోర్సును ప్రారంభించారు. ఆతిథ్య రంగంలో నైపుణ్యం కల్గిన ఉద్యోగుల కొరత ఉందని,ఈ కోర్సులో చేరిన వారికి అదే రోజు ఉద్యోగం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హయత్ కార్పొరేషన్ డైరెక్టర్ మోసం భట్టాచార్య, ప్రముఖ చెఫ్ చలపతిరావు పాల్గొన్నారు.

అల్లూరి జీవితం ఆదర్శనీయం

పటాన్‌చెరు: మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం అందరికీ ఆదర్శనీయమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా క్యాంపు కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆంగ్లేయ సైన్యాన్ని గడగడలాడించి ప్రతిఒక్కరిలో దేశభక్తిని నింపిన మహోన్నత విప్లవకారుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ వలలో ఇద్దరు ప్రైవేటు ఉద్యోగులు

పటాన్‌చెరు టౌన్: సైబర్ వలలో పడి ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగులు మోసపోయారు. అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం..బీరంగూడ బ్యాంక్ కాలనీకి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి మార్చి 28వ తేదీన పార్ట్ టైం జాబ్ ఉందంటూ ఓ మెసేజ్ వచ్చింది. దీనిని నమ్మిన బాధితుడు కొంత మొత్తం నగదు పెట్టుబడిగా పెడితే కమీషన్ ఇస్తామని గుర్తు తెలియని వ్యక్తి చెప్పడంతో తన వివరాలు నమోదు చేసి పలు దఫాలుగా మొత్తం రూ.1,25,000లు పెట్టాడు. పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగడంతో స్పందించలేదు. దీంతో బాధితుడు తను మోసపోయినట్టు గుర్తించి సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో..

బీరంగూడ సాయి కాలనీకి చెందిన మరో వ్యక్తికి జాబ్ ఆఫర్ అంటూ మార్చి 21 తేదీన మెసేజ్ వచ్చింది. నగదు ఇన్వెస్ట్ చేస్తే కమీషన్ ఇస్తామని ఆశ చూపి బాధితుడు తన వివరాలు గుర్తు తెలియని వ్యక్తికి చేరవేశాడు. దీంతో అది నమ్మిన బాధితుడు పలు దఫాలుగా రూ.2,27,000లు పోగొట్టుకున్నాడు. తను మోసపోయినట్టుగా గుర్తించిన బాధితుడు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మూడు బైక్‌లను ఢీకొన్న డీసీఎం

ఇద్దరు మృతి... మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరు టౌన్: జాతీయ రహదారిపై వెళుతున్న మూడు బైక్‌లను ఓ డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పటాన్‌చెరు ఎస్ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం..పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ నుంచి సంగారెడ్డి వైపు వెళ్లే జాతీయ రహదారిపై మంగళవారం ఇస్నాపూర్ చౌరస్తా వద్ద వెనుక నుంచి వచ్చిన డీసీఎం ముందు వెళుతున్న మూడు బైక్‌లను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏపీలోని నెల్లూరు జిల్లా నాయుడుపేటకు చెందిన సురేష్ ఆచార్య(45), ఇస్నాపూర్ గ్రామానికి చెందిన ధరావత్ రామచందర్(52) అక్కడికక్కడే మృతి చెందారు. ఇదే ఘటనలో బైక్ నడిపిన సునీల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరో ద్విచక్ర వాహనదారుడు గోపాల్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు సురేష్ ఇస్నాపూర్‌లో స్నేహితుడి వద్ద ఉంటూ శిల్పకళాకారుడిగా పనిచేస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని రామచందర్, సురేష్ ఆచార్య మృతదేహాలను పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. గాయాలపాలైన సునీల్, గోపాల్‌లను చికిత్స కోసం తరలించారు. మృతుడు సురేష్ ఆచార్య స్నేహితుడు సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. పటాన్‌చెరు ఏఎస్ఐ సురేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన రామారావు(52) పాటి గ్రామ సమీపంలోని మంజీర మిషన్ వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన రాత్రి నడుచుకుంటూ ఇంటి నుంచి బస్టాండ్ వైపు వర్షంలో వెళ్తుండగా బజాజ్ ఎల్కట్రానిక్స్ సమీపంలోకి రాగానే కాలు జారి పడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు బలమైన గాయమైంది. వెంటనే రామారావును చికిత్సనిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సలహామేరకు గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.